www.ntnews.com | నమస్తే తెలంగాణ

హైదరాబాద్, బుధవారం 24 జూలై 2024 | II

₹14.01 లక్షల కోట్లు

ఈ ఆర్థిక సంవత్సరం స్థూల మార్కెట్ రుణాల ద్వారా కేంద్ర ప్రభుత్వం సమీకరించాలనుకుంటున్నది. దేశ జీడీపీలో ఇది 5.2 శాతానికి సమానం.

సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను, షార్ట్-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్‌లు పెంచడం స్టాక్ మార్కెట్ పెట్టుబడులకు ఇబ్బందికరమే. లోక్‌సభలో బడ్జెట్ సందర్భంగా వచ్చిన ఈ ప్రకటనతో మంగళవారం సూచీలు తీవ్ర ఒడిదొడుకులకు లోనయ్యాయి.

-ఆశిష్ చౌహాన్, ఎన్ఎస్ఈ ఎండీ

సర్దుబాట్లుతో సరి..

ఆదాయ పన్నుల్లో ఊరట అంతంతే..

అంకెల గారడీతో వేతన జీవులకు మళ్లీ మొండిచెయ్యి

కొత్త పన్ను విధానంలో స్వల్ప మార్పులతో శ్లాబుల సవరణ

స్టాండర్డ్ డిడక్షన్ రూ.75,000కు పెంపు

న్యూఢిల్లీ, జూలై 23: ఆదాయ పన్ను (ఐటీ) విధానంలో మధ్యతరగతి, వేతన జీవుల ఆకాంక్షల్ని మోదీ సర్కారు పట్టించుకోలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను మంగళవారం లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా అంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన వ్యక్తిగత ఆదాయ పన్ను రేట్లపై ఊరించి ఉసూరుమనిపించారు. అంకెల గారడీతో కొత్త పన్ను విధానంలో ఊరట కల్పించామని భ్రమింపజేశారు. ట్యాక్స్ పేయర్లందర్నీ కొత్త పన్ను విధానంలోకి తీసుకురావాలన్న లక్ష్యానికి తగ్గట్టుగానే పాత పన్ను విధానం జోలికి కేంద్ర ప్రభుత్వం వెళ్లలేదు. ఇక కొత్త పన్ను విధానంలో ఇదివరకే ఉన్న పన్ను శ్లాబులను అలాగే ఉంచుతూ.. వాటి కిందనున్న వార్షిక ఆదాయ పరిమితుల్ని మాత్రం కొద్దిగా సవరించారు. గతంతో పోల్చితే 5 శాతం పన్ను పరిధిలో ఉన్న రూ.3-6 లక్షల శ్లాబును రూ.3-7 లక్షలకు పెంచారు. అలాగే 10 శాతం పన్ను వర్తించే రూ.6-9 లక్షల శ్లాబును రూ.7-10 లక్షలుగా మార్చారు. ఇక 15 శాతం పన్ను విధించే రూ.9-12 లక్షల శ్లాబును రూ.10-12 లక్షలకు తగ్గించారు. 20 శాతం, 30 శాతం పన్నులు పడే రూ.12-15 లక్షలు, రూ.15 లక్షలపైన శ్లాబులను యథాతథంగానే ఉంచారు. అప్పుడు, ఇప్పుడు రూ.3 లక్షలదాకా పన్నులేమీ లేవు. దీంతో రూ.6-7 లక్షల మధ్య, రూ.9-10 లక్షల మధ్య వార్షిక ఆదాయం ఉన్నవారికే పన్నులు తగ్గుతున్నాయి. బడ్జెట్ ప్రసంగంలో ఐటీ సవరణలతో దాదాపు 4 కోట్ల ఉద్యోగులు, పెన్షనర్లకు లాభం చేకూరుతుందని ఆర్థిక మంత్రి చెప్పినా.. రకరకాల వార్షిక ఆదాయాలున్న వారికి ఒరిగేదేమీ లేదు.

స్టాండర్డ్ డిడక్షన్‌పై..

కొత్త పన్ను విధానం కింద స్టాండర్డ్ డిడక్షన్‌ను ప్రస్తుతమున్న రూ.50,000 నుంచి రూ.75,000కు పెంచుతున్నట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ క్రమంలోనే కొత్త పన్ను విధానంలో మార్పుల వల్ల దాన్ని ఎంచుకున్న వేతన జీవులకు ఏటా రూ.17,500 వరకు పన్ను ఆదా అవుతుందని చెప్పుకొచ్చారు.

కుటుంబ పెన్షన్‌పై..

పెన్షనర్ల కోసం కుటుంబ పెన్షన్‌పైనా డిడక్షన్‌ను రూ.25,000కు పెంచారు. ఇంతకుముందు ఇది రూ.15,000గానే ఉన్నది. కాగా, కొత్త మార్పులు ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి వస్తాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం లేదా 2025-26 మదింపు సంవత్సరానికి వర్తిస్తాయి. ఇదిలావుంటే చారిటబుల్ ట్రస్టుల కోసం రెండు పన్ను మినహాయింపు విధానాలను ఏకం చేస్తున్నామని.. క్రెడిట్, ఈ-కామర్స్, విద్య, ఆరోగ్య, న్యాయ, ఎంఎస్ఎంఈ సేవల డెలివరీ, పట్టణ పరిపాలన కోసం డీపీఐ యాప్‌లను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు.

ముసుపు కొత్త పన్ను విధానం

శ్లాబులు (రూ.ల్లో)	ఆదాయ పన్ను రేట్లు
3 లక్షల వరకు	లేదు
3,00,001-6,00,000	5%
6,00,001-9,00,000	10%
9,00,001-12,00,000	15%
12,00,001-15,00,000	20%
15 లక్షలపైన	30%

ఇప్పుడు కొత్త పన్ను విధానం

శ్లాబులు (రూ.ల్లో)	ఆదాయ పన్ను రేట్లు
3 లక్షల వరకు	లేదు
3,00,001-7,00,000	5%
7,00,001-10,00,000	10%
10,00,001-12,00,000	15%
12,00,001-15,00,000	20%
15 లక్షలపైన	30%



భారీగా తగ్గిన బంగారం

రూ.3,350 దిగొచ్చిన తులం ధర

న్యూఢిల్లీ/హైదరాబాద్, జూలై 23: బంగారం కొండ దిగింది. గత కొన్ని రోజులుగా పెరుగుతూ వచ్చిన ధరలు ఒక్కసారిగా దిగువముఖం పట్టాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో పుత్తడి, వెండిపై కస్టమ్స్ డ్యూటీని తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయమే ఇందుకు కారణమని ట్రేడర్లు వెల్లడించారు. వీటిపై కస్టమ్స్ డ్యూటీని 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించడంతో వీటి ధరలు రూ.3 వేలకు పైగా దిగాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం పుత్తడి ధర రూ.3,350 దిగొచ్చి రూ.72, 300కి చేరుకున్నాయి. బంగారంతోపాటు కిలో వెండి కూడా రూ.3,500 తగ్గి రూ. 87,500 వద్ద ముగిసింది. అంతకుముందు ఇది రూ.91 వేలుగా ఉన్నట్లు ఆల్ ఇండియా సరాఫ్ అసోసియేషన్ వెల్లడించింది. ఇటు హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ పదిగ్రాముల బంగారం ధర ఏకంగా రూ.2,990 తగ్గి రూ.70,860కి దిగొచ్చింది. అలాగే 22 క్యారెట్ గోల్డ్ ధర రూ.2,750 తగ్గి రూ.64,950గా నమోదైంది. దీంతోపాటు వెండి ధరలు రూ.3,500 తగ్గి రూ.88 వేలకు చేరింది. అంతకుముందు ఇది రూ.91,500 గా ఉన్నది. అటు ఫ్యూచర్ మార్కెట్లోనూ అతి విలువైన లోహాల ధరలు ఐదు శాతానికి పైగా తగ్గుముఖం పట్టాయి. తులం పుత్తడి ధర ఏకంగా రూ.3,860 తగ్గి రూ.68,900 దిగొచ్చింది. అలాగే ఐదు శాతం తగ్గిన కిలో వెండి ఏకంగా రూ.4,000 దిగొచ్చి రూ.85,185గా నమోదైంది. గతంలో బంగారం దిగుమతులను నియంత్రించాలనే ఉద్దేశంతో కస్టమ్స్ డ్యూటీని వరుసగా పెంచుతూ వచ్చిన సర్కార్ ఈసారి మాత్రం తగ్గించడం విశేషం. దీర్ఘకాలికంగా డిమాండ్ చేస్తున్న ఆభరణాల వర్తకులకు కేంద్ర సర్కార్ శుభవార్తను అందించింది.

గ్లోబల్ మార్కెట్లో పైపైకి..

దేశీయంగా భారీగా ధరలు తగ్గిన అతివిలువైన లోహాల ధరలు అంతర్జాతీయంగా మాత్రం పెరిగాయి. న్యూయార్క్ బులియన్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 17.10 డాలర్లు పెరిగి 2,459.20 డాలర్లకు చేరుకున్నది. కానీ, వెండి ధరలు యథాతథంగా 29.31 డాలర్ల వద్ద ఉన్నాయి. డాలర్ బలహీనపడటం, అమెరికా ఆర్థిక గణాంకాలు త్వరలో విడుదలకానుండటం, ఫెడ్ వడ్డీరేట్ల తగ్గింపుపై త్వరలో నిర్ణయం తీసుకోనుండటమే బంగారం పెరగడానికి ప్రధాన కారణం.

పసిడి అక్రమ రవాణాకు చెక్

అతి విలువైన లోహాలపై కస్టమ్ డ్యూటీని తగ్గించడంతో బంగారం అక్రమ రవాణాకు చెక్ పడే అవకాశాలున్నాయని జీటీఆర్ఐ వెల్లడించింది. అయినప్పటికీ కేంద్ర ఖజానాకు భారీ గండి పడే అవకాశాలున్నాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.28 వేల కోట్ల ఆదాయం కోల్పోవచ్చునని తెలిపింది. గతేడాది భారత్ 45.54 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని, 5.44 బిలియన్ డాలర్ల విలువైన వెండిని దిగుమతి చేసుకున్నది.

20 లక్షల వరకు ముద్రా రుణాలు

న్యూఢిల్లీ, జూలై 23: వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో పదేండ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ముద్రా రుణాల పరిమితిని రెట్టింపు చేసింది. గతంలో రూ.10 లక్షల వరకు రుణం ఇవ్వనుండగా, ప్రస్తుతం దీనిని రూ.20 లక్షల వరకు పెంచుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో నిర్ణయం తీసుకున్నది. దీంతో నిధులు లేక సతమతమవుతున్న చిన్న, మధ్య స్థాయి సంస్థలకు భారీ ఊరట లభించినట్లు అవనున్నది. కార్పొరేటేతర, వ్యవసాయేతర చిన్న-మధ్యస్థాయి వ్యాపారవేత్తలకు ఆదాయ మార్గాలు చూపించాలనే ఉద్దేశంతో ఏప్రిల్ 8, 2015లో ప్రధాన మంత్రి ముద్రా యోజన(పీఎంఎంవై) స్కీంను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. మూడు విభాగాల్లో శిశు(రూ.50 వేల వరకు), కిశోర్(రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు), తరుణ్(రూ.10 లక్షలు) రుణాలు ఇచ్చారు. మరోవైపు, ఎంఎస్ఎంఈ క్లస్టర్‌లో సంస్థలకు నేరుగా రుణాలు ఇవ్వడానికి సిడ్బీ ఈ ఏడాది 24 నూతన శాఖలను ప్రారంభించనున్నట్లు మంత్రి ప్రకటించారు.

స్టార్టప్‌లపై ఏంజిల్ ట్యాక్స్ రద్దు

న్యూఢిల్లీ, జూలై 23: స్టార్టప్‌లో పెట్టుబడులను ప్రోత్సహించడానికి కేంద్రం మరో కీలక నిర్ణయం తీసుకున్నది. గతంలో స్టార్టప్‌లో పెట్టుబడులు పెట్టేవారిపై విధించిన ఏంజిల్ ట్యాక్స్‌ను పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించింది. యువతను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే ఉద్దేశంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నది. స్టార్టప్‌లు తమ విలువను పెంచుకోవాలనే ఉద్దేశంతో గతేడాది సెప్టెంబర్‌లో వీటిపై ఏంజిల్ ట్యాక్స్‌ను విధించింది. దేశీయ స్టార్టప్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే ఉద్దేశంలో భాగంగా ఈ ఏంజిల్ ట్యాక్స్‌ను ఎత్తివేస్తున్నట్లు, దీంతో వీటికి భారీ ఊరట లభించినట్లు కానున్నదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రస్తుతం దేశంలో 1.17 లక్షల స్టార్టప్‌లో ఉన్నాయి.

జీడీపీలో ద్రవ్యలోటు లక్ష్యం 4.9%

న్యూఢిల్లీ, జూలై 23: పెరిగిన రెవెన్యూ వసూళ్లతో వచ్చిన ఉత్సాహం నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరాని (2024-25)కి దేశ జీడీపీలో ద్రవ్యలోటును 4.9 శాతానికే కట్టడి చేయాలన్న లక్ష్యాన్ని పెట్టుకున్నది కేంద్ర ప్రభుత్వం. ఈ ఏడాది ఫిబ్రవరి 1న ప్రకటించిన మధ్యంతర బడ్జెట్‌లో ఇది 5.1 శాతంగా ఉన్నది. కాగా, వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో ద్రవ్యలోటును 4.5 శాతానికే పరిమితం చేయాలని మోదీ సర్కారు చూస్తున్నది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అప్పులు కాకుండా మొత్తం ఆదాయం రూ.32.07 లక్షల కోట్లుగా ఉండొచ్చని బడ్జెట్‌లో అంచనా వేశారు. అలాగే మొత్తం ఖర్చుల్ని రూ.48.21 లక్షల కోట్లుగా అంచనా వేశారు. అలాగే నికర పన్ను వసూళ్లు రూ.25.83 లక్షల కోట్లుగా ఉండొచ్చని చెప్తున్నారు.

దివాలా చట్టం కట్టుదిట్టం

న్యూఢిల్లీ, జూలై 23: ఇన్సాల్వెన్సీ ఎకోసిస్టమ్‌ను మెరుగుపర్చడానికి, ట్రిబ్యునళ్ల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం ఓ ఇంటిగ్రేటెడ్ టెక్నాలజీ వేదికను ఏర్పాటు చేయనున్నది. ఈ మేరకు దివాలా స్మృతి (ఐబీసీ)లో మార్పులు తెస్తామని బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. 2016లో ఈ చట్టం అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇప్పటిదాకా 6సార్లు సవరణలు చేశారు. కాగా, వెయ్యికి పైగా కంపెనీల కేసులను ఐబీసీ ద్వారా పరిష్కారం చేశారు. దీంతో బ్యాంకర్లు, ఇతర రుణదాతలకు నేరుగా రూ.3.3 లక్షల కోట్ల బకాయిలు వసూలయ్యాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 15 నగరాల్లో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునళ్లు (ఎన్‌సీఎల్‌టీ) ఉన్నాయి. దేశ రాజధాని నగరం ఢిల్లీలో ప్రధాన ధర్మాసనం ఉన్నది. అలాగే ఢిల్లీతోపాటు చెన్నైలో నేషనల్ కంపెనీ లా అప్పీలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) ధర్మాసనాలున్నాయి. ఈ నేపథ్యంలో కేసులు ఇంకా త్వరగా పరిష్కారమయ్యేలా ఎన్‌సీఎల్‌టీ బెంచ్‌లను మరిన్ని తెస్తామని కేంద్రం చెప్తున్నది.

డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం 50 వేల కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాల విక్రయం, ఆస్తుల నగదీకరణతో రూ.50 వేల కోట్లు సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. మరోవైపు, ప్రభుత్వరంగ సంస్థల డివిడెండ్ చెల్లింపులు రూ.56,260 కోట్ల స్థాయిలో ఉంటుందని బడ్జెట్ అంచనావేస్తున్నది. వీటితోపాటు ఆర్బీఐ, బ్యాంకులు, ఆర్థిక సేవల ఇనిస్టిట్యూషన్‌ల నుంచి రూ.2,32,874 కోట్ల డివిడెండ్ రూపంలో చెల్లించవచ్చునని తెలిపింది. మధ్యంతర బడ్జెట్‌లో అంచనావేసిన రూ.1.02 లక్షల కోట్ల కంటే ఇది రెండింతలు అధికం.

ఎఫ్‌డీఐ రూల్స్ సరళతరం

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకట్టుకోవడానికి ఎఫ్‌డీఐ మార్గదర్శకాలను మరింత సరళతరం చేయబోతున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించడంతోపాటు విదేశీ పెట్టుబడులకోసం దేశీయ కరెన్సీని వినియోగించనున్నట్లు ప్రకటించారు.

లిటికేషన్ కోసం వివాద్ సే విశ్వాస్

లిటికేషన్ కాలపరిమితిని తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్ర సర్కార్ వివాద్ సే విశ్వాస్ స్కీం 2.0 ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఫైలింగ్‌కు సంబంధించి పన్ను చెల్లింపుదారులు ఈ స్కీంతో రీ-అసెస్‌మెంట్ ప్రొసిడింగ్స్ చేసుకోవడానికి వీలుపడనున్నది. ఆదాయం రూ.50 లక్షలు లేదా అంతకంటే ఎక్కువగా ఉంటే, దీనికి సంబంధించి అసెస్‌మెంట్ ఏడాది ముగిసిన ప్పటి నుంచి గరిష్ఠంగా ఐదేండ్ల వరకు ఉన్న లిటికేషన్ కేసులను ఈ స్కీం ద్వారా పరిష్కరించనున్నారు.

పిల్లలకు ఎన్‌పీఎస్ వాత్సల్య

బడ్జెట్‌లో నూతన దీర్ఘకాలిక పొదుపు పథకం

న్యూఢిల్లీ, జూలై 23: బడ్జెట్‌లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఎన్‌పీఎస్ వాత్సల్య పథకాన్ని పరిచయం చేశారు. చిన్నారుల కోసం దీర్ఘకాలిక పొదుపును పెంపొందించడమే లక్ష్యంగా ఈ మైనర్ పెన్షన్ స్కీంను తెచ్చినట్లు మంత్రి తన ప్రసంగంలో తెలియజేశారు. తమ పిల్లల కోసం తల్లిదండ్రులు లేదా వారి సంరక్షకులు ఎన్‌పీఎస్ వాత్సల్యలో చేరవచ్చని చెప్పారు.

ఏమిటీ ఎన్‌పీఎస్ వాత్సల్య పథకం?

భవిష్యత్తులో తమ పిల్లలకు ఆర్థికపరమైన భద్రతను కల్పించాలని యోచించే తల్లిదండ్రులు, కుటుంబాలే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించారు. ప్రస్తుత నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో భాగంగానే ఈ వాత్సల్య పథకాన్నీ కేంద్రం తీసుకొచ్చింది. ఎన్‌పీఎస్‌లోని ఇతర ప్లాన్ల తరహాలోనే ఇదీ ఉంటుంది. తమ చిన్నారుల రేపటి కోసం తల్లిదండ్రులు, వారి సంరక్షకులు ఖాతాలను తెరిచి, అందులో కొంత మొత్తాలను మదుపు చేసుకోవచ్చు.

రెగ్యులర్ ఎన్‌పీఎస్ ఖాతాగా..

పిల్లలకు 18 ఏండ్లు వచ్చాక, ఈ వాత్సల్య పథకాన్ని రెగ్యులర్ ఎన్‌పీఎస్ ఖాతాగా మార్చుకునే సౌకర్యం ఉన్నది. అలాగే నాన్-ఎన్‌పీఎస్ ప్లాన్‌గా కూడా మార్చుకోవచ్చని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. రిటైర్మెంట్ నిధి ఏర్పాటుకు, క్రమపద్ధతిలో పొదుపు, పెట్టుబడులను అలవర్చుకోవడానికి ఈ పథకం దోహదం చేస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కాగా, స్టాక్స్, బాండ్లు తదితర మార్కెట్ ఆధారిత సాధనాల్లోకి ఎన్‌పీఎస్ నిధులు పెట్టుబడులుగా వెళ్తాయి. కాబట్టి ఇవి ఒకింత రిస్క్‌తో కూడుకున్న ఇన్వెస్ట్‌మెంట్స్‌గానే భావించాల్సి ఉంటుంది. అయినప్పటికీ ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ) వంటి సంప్రదాయ ఆదాయ మార్గాలతో పోల్చితే అధిక రాబడులను ఇస్తుండటం కలిసొచ్చే అంశం.

పెన్షన్ స్కీం ఆకర్షణీయం

కొత్త పన్ను విధానంలో నేషనల్ పెన్షన్ స్కీంను మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు ట్యాక్స్ డిడక్షన్‌ను 14 శాతానికి పెంచారు. కంపెనీల కంట్రిబ్యూషన్‌పై పన్ను కోతలను 10 శాతం నుంచి 14 శాతానికి తెస్తున్నట్టు మంత్రి చెప్పారు. ఉద్యోగులు, కంపెనీల యాజమాన్యాలకు పన్ను ప్రయోజనాలను పెంచేందుకే ఈ నిర్ణయమన్నారు.

మదుపరులకు గట్టి దెబ్బ

మూలధన లాభాల పన్నుల పెంపు

న్యూఢిల్లీ, జూలై 23: ఈసారి బడ్జెట్‌లో మదుపరులకు గట్టి షాక్ ఇచ్చారు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్. మూలధన లాభాలు, ట్రేడింగ్ కార్యకలాపాలు ప్రభావిత మయ్యేలా పలు కీలక పన్నులను పెంచారు.

దీర్ఘకాల మూలధన లాభాల పన్ను

అన్ని ఆర్థిక, ఆర్థికేతర ఆస్తులపై లాంగ్-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ (ఎల్‌టీసీజీ లేదా దీర్ఘకాల మూలధన లాభాలు) పన్ను రేటును 12.5 శాతానికి పెంచారు. అంతకుముందు 10 శాతంగానే ఉండేది. దీంతో గతంలో చెల్లించిన ఎల్‌టీసీజీ ట్యాక్స్‌పై మరో 25 శాతం అదనంగా ఇకపై ఇన్వెస్టర్లు చెల్లించాల్సి వస్తున్నది. అయితే నిర్దేశిత ఆర్థిక ఆస్తులపై మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వర్గాల కోసం మూలధన లాభాల మినహాయింపును ఏటా రూ.1.25 లక్షలకు పెంచాలనే యోచన ఉన్నట్టు మంత్రి చెప్పారు.

స్వల్పకాల మూలధన లాభాల పన్ను

కొన్ని ఆర్థిక ఆస్తుల నుంచి అందుకునే షార్ట్-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ (ఎస్‌టీసీజీ లేదా స్వల్పకాల మూలధన లాభాలు) పన్ను రేటును 20 శాతానికి పెంచుతున్నట్టు బడ్జెట్‌లో ప్రకటించారు. ఇంతకుముందు ఇది 15 శాతంగానే ఉండేది.

ఎఫ్‌అండ్‌వో ట్రేడింగ్ భారం

ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్‌అండ్‌వో) ట్రేడింగ్‌ను భారం చేస్తూ సెక్యూరిటీస్ ట్రాన్జాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ)ను కేంద్రం పెంచేసింది. రిస్క్‌తో కూడిన ఈ పెట్టుబడులకు ఈక్విటీ, ఇండెక్స్ ట్రేడర్లు తదితర రిటైల్ ఇన్వెస్టర్లు దూరంగా ఉండేలా ఎస్‌టీటీని రెట్టింపు చేసింది. 0.02 శాతంగా ప్రకటించింది. ఇంతకుముందు 0.01 శాతమే. పెరిగిన రేట్లు అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయి.

బైబ్యాక్ షేర్లపై..

షేర్ బైబ్యాక్‌కు చెల్లించే నగదును డివిడెండ్‌గానే చూడాల్సి వస్తుందని బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే అక్టోబర్ 1 నుంచి దానిపై పన్ను పడుతుందని తేల్చిచెప్పారు. షేర్లను అమ్ముకున్నవారికి వచ్చే మొత్తాలు ఆదాయ పన్ను సహితం అన్నారు. కాబట్టి వారు సదరు ఆదాయంపై పన్ను చెల్లించాల్సిందేనని పేర్కొన్నారు.

టీడీఎస్ తప్పదు

స్థిరాస్తి విలువ రూ.50 లక్షలు, ఆపై ఉంటే దాని అమ్మకంపై 1 శాతం ట్యాక్స్ డిడక్షన్ ఎట్ సోర్స్ (టీడీఎస్) వర్తిస్తుందని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో ప్రకటించారు. అమ్మకందారులు లేదా కొనుగోలుదారులు ఎక్కువగా ఉన్నప్పటికీ టీడీఎస్ మినహాయింపు తప్పనిసరి అని చెప్పారు. ఇదిలావుంటే సంవత్సరానికిపైగా ఉన్న లిస్టింగ్ ఫైనాన్షియల్ అసెట్స్‌ను దీర్ఘకాలంగానే భావిస్తారు. అన్ లిస్టింగ్ ఆర్థిక, ఆర్థికేతర ఆస్తులు రెండేండ్లకుపైగా ఉంటే కూడా ఇదే వర్తిస్తుంది. అన్‌లిస్టెడ్ బాండ్లు, డెట్ మ్యూచువల్ ఫండ్లు, మార్కెట్ ఆధారిత డిబెంచర్లు, ఇతర డిబెంచర్లపైనా మూలధన లాభాల పన్నును చెల్లించాల్సిందే.

సార్వత్రిక బడ్జెట్‌లో ఎంఎస్ఎంఈ తోపాటు వ్యవసాయం రంగానికి అధిక నిధులు కేటాయించారు. పారిశ్రామిక క్లస్టర్లలో సిడ్బీ శాఖను ఏర్పాటు చేయనుండటంతో రుణాలు తీసుకోవడం మరింత సులభతరం కానున్నది. విద్యా, ఉద్యోగ కల్పన, ప్రతిభను ప్రోత్సహించడానికి భారీ స్థాయిలో నిధులను కేటాయించారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి ముద్రా రుణాల పరిమితిని రూ.20 లక్షలకు పెంచారు.

- సాయి దీప్రసాద్,
సీఐఐ తెలంగాణ చైర్మన్

ఉద్యోగ కల్పన, ప్రతిభను పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిచ్చింది. బంగారం, వెండిపై కస్టమ్ సుంకాన్ని తగ్గించడంతో వీటి ధరలు భారీగా తగ్గనున్నాయి. దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్‌ను 10 శాతం నుంచి 12.5 శాతానికి పెంచారు.

- రాజీవ్ కుమార్,
నీతి ఆయోగ్ వైస్ చైర్మన్

పీఎంఏఐతో రుణాలకు డిమాండ్ పెరగనున్నది. ద్రవ్యోల్బణాన్ని 4.9 శాతానికి కట్టడి చేస్తే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం కానున్నది. క్రెడిట్ గ్యారెంటీ స్కీంతో చిన్న వ్యాపార సంస్థలకు ఊతమిచ్చినట్లు కానున్నది. నిధులు లేక సతమతమవుతున్న సంస్థలకు రుణాలు లభించనున్నాయి.

- బినేశ్ ఖారా, ఎస్బీఐ చైర్మన్

స్టార్టప్‌లపై ఏంజిల్ ట్యాక్స్ ఎత్తివేయడంతో పెట్టుబడిదారుల్లో నమ్మకం మరింత పెరగనున్నది. దీంతో మరింత మంది పెట్టుబడిదారులు స్టార్టప్‌ల్లో ఇన్వెస్ట్ చేసే అవకాశాలున్నాయి. స్పేస్ రంగానికి ఊతమివ్వడానికి రూ.1,000 కోట్లతో వెంచర్ క్యాపిటల్ ఫండ్‌ను ఏర్పాటు చేయనున్నారు.

- ఎం శ్రీనివాస్ రావు,
టీ-హబ్ సీఈవో

మార్కెట్లకు రుచించని బడ్జెట్

ఇంట్రాడేలో 1,200 పాయింట్లు..చివర్లో 73 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబై, జూలై 23: నరేంద్ర మోదీ సర్కార్ ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్ స్టాక్ మార్కెట్లకు రుచించలేదు. తీవ్ర ఒడిదుడుకుల మధ్య కొనసాగిన సూచీలు చివరకు స్వల్పంగా నష్టపోయాయి. ఫ్యూచర్ అండ్ ఆప్షన్ లావాదేవీలపై పన్ను పెంచనున్నట్లు ప్రకటించడంతో ఒక దశలో 1,200 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ చివరకు 73 పాయింట్ల నష్టంతో 80,429 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 435 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ చివరకు 30.20 పాయింట్లు కోల్పోయి 24,074.20 వద్ద స్థిరపడింది. మరోవైపు కస్టమ్ డ్యూటీని తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయంతో కన్స్యూమర్ డ్యూరబుల్, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లు ఈ భారీ పతనాన్ని నియంత్రించగలిగాయి.

ఆభరణాల సూచీలు హైజంప్

ఆభరణాలపై కస్టమ్ డ్యూటీని తగ్గిస్తూ కేంద్ర సర్కార్ తీసుకున్న నిర్ణయంతో ఆభరణాల సూచీలు 14 శాతం వరకు లాభపడ్డాయి. వీటిలో టీబీజెడ్ షేరు 13.86 శాతం లాభపడగా, టైటాన్ షేరు 6.63 శాతం, రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ 6.32 శాతం, పీసీ జ్యువెల్లర్స్ 5 శాతం, సెంకో గోల్డ్ 4.75 శాతం, కల్యాణ్ జ్యువెల్లర్స్ 4.53 శాతం వరకు పెరిగాయి.

మెరిసిన ఎఫ్ఎంసీజీ రంగ షేర్లు

వ్యవసాయ, దీని అనుబంధ రంగాలకు భారీగా నిధులు కేటాయిస్తూ బడ్జెట్‌లో తీసుకున్న నిర్ణయం ఈ రంగ షేర్లలో జోష్ పెంచింది. ఐటీసీ షేరు అత్యధికంగా 5 శాతానికి పైగా బలపడ్డాయి.

ఏపీ షేర్లు కూడా...

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన షేర్లు భారీగా పుంజుకున్నాయి. ఏపీ రాజధానికి రూ.15 వేల కోట్ల నిధులను కేటాయిస్తున్నట్లు ప్రకటించడంతో హెరిటేజ్ ఫుడ్స్ 5 శాతం, అవంతి ఫీడ్స్ 4.60 శాతం, కావేరీ సీడ్స్ 2.21 శాతం చొప్పున బలపడ్డాయి.

- టైటాన్, ఐటీసీ సంస్థలు ఐదు శాతానికి పైగా పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచాయి.
- వీటితోపాటు అదానీపోర్